www.jananinadam.com

RNI NO:TGTEL/25/A0870

Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక



**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



గురువారం 10-09 - 2026

సంపుటి : 2 సంచిక : 131

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com




2వ పేజీలో...

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్...

**కాంగ్రెస్ సర్కార్ పై ఫిర్యాదుల వెల్లువ**

**గవర్నర్ తో బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ**
**1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ**
**తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు**
**దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్కు అందజేత**
**రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ భవన్ లో గవర్నర్తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోంద ని ఈ సందర్భంగా వారు గవర్నర్ కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిసన్తా,

## ఎర్రవల్లి ఫామ్ హౌస్లో కుట్ర.. కేసీఆర్పై అసెంబ్లీలో

# రేవంత్ ఆరోపణలు



**ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి**
**స్పీకర్ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం**
**బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ**
**స్పీకర్కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య**

అసెంబ్లీ స్పీకర్ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు.

2వ పేజీలో...

# కేసీఆర్ కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్

**కేస్ఆర్కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్**
**కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎంరేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి**
**కేసీఆర్కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ**
**సిరిసిల్లలో సీఎం రేవంత్కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు.**
**హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య**



**హైదరాబాద్ 09:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. వీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తు న్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పా యింట్లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్రూమ్లో జారిపడినప్పుడు సీఎం రేవంత్రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. ...మిగతా లో...

# ఎండిపోతున్న పంటలు... రైతుల గగ్గోలు...

**జననినాదం,నిజామాబాద్, సెప్టెంబర్ 9,:** తెలంగాణలో వర్షాకాల సీజన్ కీలక దశకు చేరుకున్న సమయంలో వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఆశించిన స్థాయిలో పంటల సాగు జరగకపోగా.. ప్రస్తుతం పంటల ఎదుగుదలకు అత్యవసరమైన వర్షాలు లేకపోవడం సమస్యగా మారింది. రాష్ట్రంలో ఈ వర్షాకాల సీజన్లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే 22.5 శాతం లోటు నమోదైంది. ముఖ్యంగా 20 జిల్లాల్లోని 376 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి.నాలుగు నెలల వర్షాకాల సీజన్లో జూన్లో 11.74 శాతం, జూలైలో 1.36 శాతం, ఆగస్టులో 37.67 శాతం, సెప్టెంబరులో ఇప్పటివరకు ఏకంగా 77.76 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సాధారణంగా 626.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 485.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 140.6 మిల్లీమీటర్ల లోటు ఏర్పడింది. జిల్లాల వారీగా పరిస్థితిని పరిశీలిస్తే హనుమకొండలో అత్యధికంగా 48.73 శాతం లోటు నమోదైంది. ఆ తర్వాత వరంగల్లో 47.58, జనగామలో 44.14, జోగులాంబ గద్వాలలో 42.44, భద్రాద్రి కొత్తగూడెంలో 37.93 శాతం లోటు ఉంది. ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబాబాద్,



2వ పేజీలో...

# మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు

**- వీడియోలు విడుదల చేసిన మంత్రి సీతక్క**
**- సబిత, సునీత, కోవ లక్ష్మిని నెట్టేశారని వ్యాఖ**



**హైదరాబాద్, సెప్టెంబర్09:** అసెంబ్లీ గేటువద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణల వివాదం మరో మలుపు తిరిగింది. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని పోలీసులు కాదని.. వారి సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే వెనుక నుంచి నెట్టేశారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించినవిగా పేర్కొంటూ కొన్ని వీడియోలు, ఫొటోలను ఆమె మీడియాకు విడుదల చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్రెడ్డి తమ పార్టీ మహిళాసభ్యులను వెనుక నుంచి నెట్టారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష సభ్యులు ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. గత సోమవారం నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎన్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు గేటు వద్ద అడ్డుకున్న సమయంలో తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

# ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు

**అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్**
**బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్**



ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడు తున్నామనే భయంతోనే కుట్రలు చేస్తు న్నారని మండిపాటుతెలంగాణ శాసన సభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్ ను బయటకు తోసేయండి' అని మార్షల్స్ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడు తుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

## యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్

# తెలంగాణపైనేబీజేపీ గెలుపును ఎవరూఆపలేరు..

**: బండి సంజయ్**

**రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అన్నబండి సంజయ్**
**కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య**
**పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం రేవన్న సంజయ్**



**హైదరాబాద్, సెప్టెంబర్09:** తెలంగాణాలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయ మని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణ పైనే ఉంటుం దని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు.

2వ పేజీలో...

## ఇ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన..

# కేంద్రానికి మద్దతు...

**ఇ20 పెట్రోల్తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్**
**తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి**
**ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు**



ఇథనాల్ కలిపిన ఈ 20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచా రంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అంద లేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ 20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవు తున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు.

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్...

మొదటిపేజీ తరువాయి...




అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడు తూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. టీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ.73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్ ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## ఎండిపోతున్న పంటలు... రైతుల గగ్గోలు...

మొదటిపేజీ తరువాయి...

ఖమ్మం, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.రాష్ట్రంలోని 621 మండలాల్లో 15 మండలాల్లో అత్యధిక లోటు, 361 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 213 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా.. 32 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. వర్షాభావం ప్రభావం ప్రధానంగా వరి సాగుపై పడింది. రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 1,22,70,185 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. అంటే 92.69 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తయింది. గత ఏడాది ఇదే సమయానికి 1,28,76,525 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.ప్రధాన పంట వరి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సాధారణంగా 65,95,645 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 53,88,969 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అంటే 81.7 శాతం విస్తీర్ణానికే పరిమితమైంది. గత ఏడాది ఇదే సమయానికి 63,66,253 ఎకరాల్లో వరి సాగైంది. కీలక సాగు సమయం దాటిపోవడంతో ఇక వరి విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట ఎదుగుతున్న దశలో ఉండటంతో వర్షాలు లేక పొలాల్లో నీటి కొరత ఏర్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు పత్తి, ఇతర పంటలు కాత, పూత దశకు చేరుకున్నాయి. ఈ దశలో తగినంత తేమ అందకపోతే దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది.వ్యవసాయశాస్త్రవేత్తల ప్రకారం పంటలను ప్రస్తుత పరిస్థితి నుంచి గట్టెక్కించాలంటే కనీసం రెండు నుంచి మూడు భారీ వర్షాలతో పాటు వారం రోజులపాటు సాధారణ వర్షాలు అవసరం.



అప్పుడే పంటలకు అవసరమైన తేమ లభించి దిగుబడులపై ప్రతికూల ప్రభావాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా, వరి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ దృష్టి సారిస్తోంది. వరి పొలాల్లో గడ్డి పెరిగిన ప్రాంతాల్లో ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగు ఆశాజనకంగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మసేద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## ఎర్రవల్లి ఫామ్ హౌస్లో కుట్ర.. కేసీఆర్పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి



ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్హౌస్లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామహౌస్కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమా నించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.

## మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు

మొదటిపేజీ తరువాయి...



తదితర మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.ఈ అంశంపై గవర్నర్కు సైతం ఫిర్యాదు చేసి, ఆధారాలు సమర్పించినట్లు కేటీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సీతక్క విడుదల చేసిన వీడియోలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మహిళా ఎమ్మెల్యేలకు జరిగినట్లు చెబుతున్న ఘటనలకు పోలీసులు కారణం కాదని, బీఆర్ఎస్ నేతల తోపులాటలోనే వారు ఇబ్బందులకు గురయ్యారని సీతక్క వాదించారు. మరోవైపు అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలో గాయపడినట్లు చెబుతున్న మహిళా పోలీసు సిబ్బందిని సీతక్క పరామర్శించారు. విధులకు ఆటంకం కలిగించడం, దుర్భాషలాడటం, బెదిరించడం తదితర ఆరోపణలపై కేటీఆర్, హరీశ్రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. కొంతమంది బీఆర్ఎస్ నేతలు తమ ఎదుట టీషర్టులు విప్పి నిరసనకు దిగారని, తోపులాటలో ఇబ్బందులకు గురిచేశారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో ఆరోపించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించబోదని సీతక్క స్పష్టం చేశారు. అయితే సీతక్క విడుదల చేసిన వీడియోలు, ఫొటోలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని మార్ఫింగ్ చేశారని, కృత్రిమ మేధతో రూపొందించిన దృశ్యాలని ఆరోపిస్తూ మంత్రి వాదనను కొట్టిపారేశారు. దీంతో అసెంబ్లీ గేటు వద్ద మహిళా ఎమ్మెల్యేలను ఎవరు నెట్టారన్న అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పర విరుద్ధ వాదనలు వినిపిస్తున్నాయి. వీడియోల ప్రామాణికత, ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

### యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్

## తెలంగాణపైనేబీజేపీ గెలుపును ఎవరూఆపలేరు..

మొదటిపేజీ తరువాయి...

భద్రా చలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ ల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా



ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

### ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన..

## కేంద్రానికి మద్దతు...

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ



తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ 20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## ఎస్ ఐ ఆర్ లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - 2026లో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం నర్వ గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలను వేగవంతం చేసి నిర్ణీత గడువుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియ నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో ఓటర్లకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని టేకుమట్ల గ్రామంలో తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాబు లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కుందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసిల్దార్ తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించి



విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. అనంతరం వేలాల గ్రామంలో ఇసుక రీచ్ నుండి ఎస్.ఎస్.ఎం.ఎం.ఎస్. వెబ్ సైట్ ద్వారా చేపడుతున్న ఇసుక సరఫరా ప్రక్రియను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఇసుకను పారదర్శకంగా, అధికారికంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు బుకింగ్ ప్రకారం నిర్ణీత గడువులోగా సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షించాలని, ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ గర్వించదగ్గ

## మహనీయుడు కాళోజి నారాయణరావు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజి నారాయణరావు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు ల తో కలిసి హాజరై కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజలందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ వైతాళికుడిగా జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా జీవించాడని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతి రోజున తెలంగాణ భాషా దినోత్సవంగా వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థి దశలోనే నిజాంను ఎదిరించి తెలంగాణలో విద్యా వ్యాప్తికి కృషి చేశారని, తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూ ఆదర్శంగా నిలిచారని



అన్నారు. కాళోజీ నారాయణరావు బహు బాషా కోవిదులు అని, కవిగా, రచయితగా తెలుగుతో పాటు వివిధ భాషలలో హ్యూమన్ రైట్స్, కుల వివక్ష లేని సమాజంపై రచనలు చేశారని తెలిపారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ రావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో చైతన్యం నింపిన కాళోజీ

### అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**కరీంనగర్ సెప్టెంబర్ 09:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కవిత్వం, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం, స్ఫూర్తి నింపారని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాష, సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, అణిచివేత, అన్యాయాలపై ఆయన ధిక్కార స్వరం వినిపించారని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కాళోజీ ఆశయాల బాటలో ప్రజలకు సేవ చేయాలని సూచించారు.



# ఘనంగా సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవం

**సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా సేవాలాల్ సేన పోరాటం**
**: జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్ లాల్ నాయక్**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 09:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్ లాల్ నాయక్ మాట్లాడుతూ.. "సేవాలాల్ సేన అంటే ఒక పేరు కాదు.. ఒక ఆయుధం, ఒక పోరాటం" అని అన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన లక్ష్యంగా సేవాలాల్ సేన నిరంతరం పోరాడుతోందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సేవాలాల్ సేన ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. విద్యార్థులు, ప్రజల సమస్యలపై ఎన్నో సభలు, కార్యక్రమాలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి వారి హక్కుల కోసం పోరాడిన ఘనత సేవాలాల్ సేనకు దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, సింగిల్ విండో చైర్మన్ ఆలీ పాల్గొన్నారు. వారి సమక్షంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు రాథోడ్ రూప్ లాల్ నాయక్ జెండా ఆవిష్కరించారు.

సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జరుపుల తిరుపతి, తూర్పు జిల్లా రైతు సేన అధ్యక్షులు అజ్మీరా తిరుపతి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ లవ్ దే మోహన్, బానోత్ గోపాల్ నాయక్, రాథోడ్ ఉత్తమ్ నాయక్, రాథోడ్ బలవంత్ నాయక్, సర్పంచులు గుగులోత్ రాజేందర్, గుంటి రవీందర్, ఇస్లావత్ అంబాజీ, రాథోడ్ గులాబ్ సింగ్, పవర్ రవి నాయక్, కెరమెరి మండల అధ్యక్షులు రాథోడ్ బాబు, మండల ఉపాధ్యక్షులు ధరావత్ ధనరాజ్, జనరల్ సెక్రెటరీ ఇస్లావత్ రవి, పవర్ రవీందర్, లావుడ్యా సుబ్బారావు, యూత్ అధ్యక్షులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తాం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 09:** జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని కలెక్టర్ కె. హరిత తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు పర్యాటక రంగంపై వివిధ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, రవాణా, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, భద్రత, పార్కింగ్, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు మెరుగుపరిచేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు సోషల్ మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడతామని, సినిమాల చిత్రీకరణకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# వార్డు సభ్యుల జిల్లా అధ్యక్షుడిగా జావీద్ ఉపాధ్యక్షుడిగా మందాడే శివరాం ఏకగ్రీవ ఎన్నిక



జిల్లా వార్డు సభ్యుల కమిటీ అధ్యక్షులు జావీద్




ఉపాధ్యక్షులుగా మందాడే శివరాం

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 09:** ఆసిఫాబాద్ జిల్లా వార్డు సభ్యుల సంఘం అధ్యక్షుడిగా ఆసిఫాబాద్ రాజంపేటకు చెందిన జావీద్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కెరమెరి మండలం ఖైరి గ్రామానికి చెందిన మందాడే శివరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వార్డు సభ్యుల సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొని అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో గ్రామాల అభివృద్ధి, వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక సంస్థల్లో వార్డు సభ్యుల పాత్ర, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల బాధ్యత తదితర అంశాలపై చర్చించారు. వార్డు సభ్యుల సమస్యలను సమిష్టిగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సంఘం తరఫున కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జావీద్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మందాడే శివరాంలు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వార్డు సభ్యులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో వారి పాత్ర మరింత బలోపేతం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. శాలువాలతో ఘన సన్మానం జిల్లా అధ్యక్షుడిగా జావీద్, ఉపాధ్యక్షుడిగా మందాడే శివరాం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వార్డు సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నాయకత్వం ఆధ్వర్యంలో వార్డు సభ్యుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జావీద్, మందాడే శివరాంల ఎన్నిక పట్ల ఆయా గ్రామాల ప్రజలు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పురాతన గ్రంథాల గుర్తింపు

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరచే ప్రక్రియపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు, పాత పత్రాలు, తాళపత్ర గ్రంథాల సమాచారాన్ని అధికారులకు అందించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను శాస్త్రీయ పద్ధతులలో డిజిటలైజేషన్ చేసి, వాటి సమాచారాన్ని రక్షించడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కేంద్రీకృత ప్రదేశంలో భద్రపరిచి, కేంద్రీకృత డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలు, స్థానిక వారసత్వానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేందుకు జ్ఞాన భారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పండుగను సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ-కె.వై.సి., మొబైల్ నంబర్ సీడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** ఈ-కె.వై.సి., మొబైల్ నంబర్ సీడింగ్ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి జిల్లాలోని ఫెయిర్ ప్రైస్ షాప్ ల మండల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఫెయిర్ ప్రైస్ షాపుల పరిధిలో ఈ-కె.వై.సి., మొబైల్ నంబర్ సీడింగ్ ప్రక్రియను చేపట్టి తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. వేలం ప్రక్రియలో బిడ్డర్‌కు దొడ్డు బియ్యం అప్పగించే సమయంలో ఎటువంటి అవకతవకలు, తేడాలు లేకుండా నిబంధనల ప్రకారం బియ్యాన్ని అప్పగించేందుకు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, శాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సివిల్ సప్లయ్స్ ఆఫీసర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** వానాకాలం 2026--27 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కొరకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ధాన్యం, గోనె సంచుల గుత్తేదారులు, ఎస్.డబ్ల్యు.సి. గోదాము మేనేజర్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026--27లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి, కొనుగోలు సీజన్ ప్రారంభమయ్యే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టి గోదాములను వినియోగానికి అనుకూలంగా సిద్ధం చేయాలని సూచించారు. గోదాములకు అవసరమైన సిబ్బంది, హమాలీలను ముందస్తుగానే సమకూర్చుకోవాలని, ఓ.పి.ఎం.ఎస్. రసీదులను ప్రతిరోజూ తప్పనిసరిగా క్లియర్ చేయాలని తెలిపారు. ధాన్యం రవాణాకు సంబంధించిన ధాన్యం, గోనె సంచుల గుత్తేదారులు అవసరమైన వాహనాలను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. అన్ని వాహనాలకు జి.పి.ఎస్. అమర్చి, సీజన్ ప్రారంభమయ్యేలోపు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఎలాంటి రవాణా సమస్యలు తలెత్తకుండా అవసరమైన సంఖ్యలో వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు అవసరమైన మేరకు హమాలీలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని ధాన్యం మిల్లింగ్ అనంతరం సి.ఎం.ఆర్. డెలివరీలను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, కొనుగోలు, నిల్వ, రవాణా, సి.ఎం.ఆర్. డెలివరీ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో నూతన పార్కింగ్ సదుపాయం ప్రారంభం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 09:** కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు, సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసిన నూతన కార్లు, మోటారు సైకిళ్ల పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ కె. హరిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారని తెలిపారు. సందర్శకులు తమ వాహనాలను నిలిపేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, సౌకర్యవంతమైన పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సదుపాయాన్ని ప్రజలు, అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, రెవెన్యూ కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. దత్తరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 09:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించి, జిల్లాలలో పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధి కోసం ఆసక్తి కలిగిన యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాలలో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని తెలిపారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని, ఇందు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి, కేంద్రీకృత సేకరణ లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా కొదురుపాక పవన్



**జననినాదం,తిర్యాణి 09:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా తిర్యాణి మండలం నాయకపుగూడ ఉపసర్పంచ్ కొదురుపాక పవన్, కోశాధికారిగా గోయగం ఉపసర్పంచ్ ముక్కెర సరిత ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఫోరం కార్యవర్గ సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తిక్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, జిల్లా అధ్యక్షుడు దీపక్ ముండే అధ్యక్షత వహించారు. అనంతరం పవన్, సరిత ను శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పవన్ నంద మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఉపసర్పంచుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ఉపసర్పంచుల సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు చేని కుమార్, పలువురు ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# జలపాతం ఆదాయంలో 20 శాతం వాటా



**జననినాదం,తిర్యాణి 09:** మందగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని జలపాతం ఆదాయంలో గ్రామ పంచాయతీకి 20 శాతం వాటా ఇచ్చేందుకు అటవీశాఖ అధికారులు అంగీకరించారు. బుధవారం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు చర్చ జరిగింది. 2026 నుంచి 2028 వరకు రెండేళ్లపాటు 20 శాతం వాటాకు గ్రామస్థులు అంగీకరించారు. అనంతరం వాటా పెంచకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని గ్రామసభలో తీర్మానించారు. జలపాతం ద్వారా వచ్చే ఆదాయం, బ్యాలెన్స్ వివరాలను ప్రతి నెల 1న గ్రామస్థులకు చూపిస్తామని అటవీశాఖ అధికారులు హామీ ఇచ్చారు. ఈటీసీ కమిటీని కొనసాగించాలని, జలపాతం ద్వారా గ్రామ పంచాయతీకి రావాల్సిన మొత్తాన్ని క్రమం తప్పకుండా జమ చేయాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తురం గోపాల్, అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలు వద్దు ... జీవితంపై ఆశే ముద్దు

## ( నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా )




మనిషి జీవితం సుఖ దుఃఖాల
నిలయం కష్ట సుఖాల
కలిమి లేముల సంగమం
జీవిత చక్రంలో చీకటి వెలుగులు
ఉత్థాన పతనాలు సహజం
జీవితంలో కష్టాల కడలి
దాటిన తర్వాత సుఖాల తీరం
కనిపిస్తుంది.ఓటమికి కుంగి పోయి
కుదేలైతే జీవితం ముగియదు
ఆశలరెక్కలు విరుచేసుకుని
తనువు చాలించడం తగదు
కన్నీళ్ళు తుడిచే కాలం వస్తుంది
నమ్మకం తో అడుగెయ్యి
ఆత్మహత్య అనే ఆలోచన వీడి
ధైర్యంగా గమ్యం వైపు సాగిపో
జీవితం అనేది దేవుడిచ్చిన వరం
పోరాడి గెలవడమే జీవిత సారం
ఆశనే శ్వాసగా మలచుకో
సమస్యలను ధైర్యంగా ఎదుర్కో
ఒంటరి తనం తో బాధపడే
వారికి కుటుంబ సభ్యులు
అండగా నిలువాలికష్టాల్లో
ఉన్న వారినిగేలిచేయకుండా
సమాజంఒక రక్షణ కవచంగా
నిలిచిమానసిక ధైర్యం ఇవ్వాలి.
వ్యక్తిలో వస్తున్న మార్పులను
గమనించి నిరాశను ముందే
గుర్తించి ప్రేమతో కౌన్సిలింగ్
ఇప్పించాలి.నేను ఉన్నాను
అనే ఒక్కమాటతోటివారికి
చేసే చిన్న సాయం
అమూల్యమైన ప్రాణాన్ని
కాపాడుతుంది.లేవండి!
మేల్కొనండి!! గమ్యం చేరే వరకు
విశ్రమించకండి అన్న
స్వామి వివేకానంద సూక్తి
స్ఫూర్తిగా తీసుకోవాలి.
మీ పైమీకు నమ్మకం ఉంచండి
ప్రతి సమస్యకు పరిష్కారం
ఉంటుంది మీ జీవితాన్ని ఆశతో
ధైర్యంతో ముందుకు నడిపించండి



నేదునూరి కనకయ్య అధ్యక్షులు
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
రచయిత కాలమిస్ట్
కరీంనగర్ 9440245771

# సచిన్ ను కలిసిన నాగేంద్ర



**జననినాదం,తిర్యాణి 09:** చారిత్రక రౌతు సంకెపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో గ్రామాన్ని దత్తత తీసుకున్న రాయపూడి నాగేంద్ర ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలిశారు. గ్రామ యువతను క్రీడల్లో ప్రోత్సహించడంతో పాటు తాను జాతీయ జట్టులో చోటు సాధించేందుకు సచిన్ మార్గదర్శకత్వం కోరారు. అనంతరం ముంబయికి బయలుదేరిన నాగేంద్రకు నేషనల్ ట్రైబల్ ఫెస్టివల్--2027 కమిటీ చైర్మన్ మడావి గుణవంత్‌రావు, ముఖ్య సలహాదారు సిడాం అర్జు మాస్టర్, కుంరం భీము కుటుంబ సభ్యులు, కోఆర్డినేటర్ కొమరం వెంకటేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు

# జేఏసీ సమావేశానికి తరలిరావాలి



**జననినాదం,తిర్యాణి 09:** కన్నేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు గురువారం నిర్వహించనున్న జేఏసీ ముఖ్య సమావేశానికి హాజరుకావాలని కన్నేపల్లి సర్పంచ్ తురం మాన్కు , జేఏసీ నాయకుడు కుడ్మేత అర్జున్ కోరారు. ఈ మేరకు బుధవారం కన్నేపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల పటేల్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులకు జేఏసీ నోటీసులు అందజేశారు. సమావేశానికి అన్ని వర్గాల నాయకులు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ సెప్టెంబర్ 09:** ప్రతి జిల్లాలోని పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, ప్రత్యేక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని, సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించి పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలన్నారు. జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా ప్రాచీన గ్రంథాలు, శాసనాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించడంతో పాటు డిజిటలైజ్ చేయాలని తెలిపారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఏఈఈ జీవన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఐఎఫ్ఏటి ఇండియా-2026 ప్రదర్శనలో

# కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్ సెప్టెంబర్ 09:** కరీంనగర్ నగరానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన మౌలిక సదుపాయాలు, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ అందించడమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ముంబైలో జరుగుతున్న 13వ 'ఐఎఫ్ఏటి ఇండియా-2026' అంతర్జాతీయ ప్రదర్శనలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు బొంబాయి ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో నీటి నిర్వహణ, వ్యర్థాల రీసైక్లింగ్, పర్యావరణ సాంకేతికతలలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఆయన పరిశీలించారు. తాగునీటి సరఫరా డిజిటలైజేషన్, మురుగునీటి శుద్ధి, జల వనరుల పునరుద్ధరణ, చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్--డ్రై వేస్ట్ రీసైక్లింగ్, అధునాతన స్వీపింగ్ యంత్రాలు, కాలుష్య నియంత్రణ సాంకేతికతలను కమిషనర్ పరిశీలించారు. వివిధ దేశాల నిపుణులతో చర్చించి, కరీంనగర్‌ను మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను తెలుసుకున్నారు. వార్తను మరింత సంక్షిప్తంగా మార్చండి

# ఈ వీ ఎం గోదాంను తనఖీ చేసిన కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి,సెప్టెంబర్ 09:** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి పాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు మరియు వివి పాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. గోదాంలో భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు నిష్పాక్షికత కోసం ఈవిఎం, వివి పాట్ ల భద్రత అత్యంత కీలకమని తెలిపారు. ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ ఆదర్శంగా ముందుకు సాగాలి...

**కలెక్టర్ రాహుల్ శర్మ.**

**జయశంకర్ భూపాలపల్లి.సెప్టెంబర్ 09:** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జీవితం ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కాళోజీ 112వ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ తన కవిత్వం, రచనలు, ఉద్యమ స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, యాస, సంస్కృతి, ప్రజల ఆకాంక్షలను తన సాహిత్యంలో ప్రతిబింబించిన గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలపై ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలిచిన కాళోజీ సాహిత్యం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ భాష, యాస, నుడికారానికి కాళోజీ చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఆయన విలువలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కాళోజీ ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి,బిసి సంక్షేమ అధికారి ఇందిర ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS**, and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460